


మంచి వడ్రంగి గ్రిగోరీ పెట్రోవ్ పెద్ద తాగుబోతు కూడా. అతడు ఒకప్పుడు పేరున్న వడ్రంగి. ఇప్పుడు మాత్రం కేవలం తాగుబోతు. భార్యకు జబ్బుగా వుంది. ఆస్పత్రికి తీసుకెళ్లాలి. ప్రాధేయపడి, పొరుగింటి వాళ్ల గుర్రబ్బండీలో ప్రయాణమయ్యాడు.

మంచుగాలి మొహం మీద కొడుతున్నది. దారినిండా మంచుగుట్టలు. బండీ సాగటం కష్టంగా వుంది. ముందరేముందో కనిపించడం లేదు. క్షణక్షణమూ ఈ ప్రకృతి వుధృతం పెరుగుతుందే తప్ప తగ్గే సూచనలు లేవు. పొలాల నిండా, టెలిగ్రాఫు స్థంభాలమీద, చెట్లమీద దట్టంగా కప్పుకున్న మంచు చూడలేకుండా వాళ్లలో, గాలి పీల్చుకోలేకుండా ముక్కుపుటాల్లో మంచు. బక్కచిక్కిన గుర్రం కుంటుతున్నది. ఆ మంచు గుట్టల్లో కాలుతీసి కాలు వెయ్యాలన్నా కష్టంగా వున్నది.

# చావు బ్రతుకు



రష్యన్‌మూలం: చెహోవ్
తెలుగు గొంతు: కరుణారుణ

వడ్రంగిలో భయం మొదలైంది.

"భయపడకే కాస్త ఓపికపట్టు. ఇదిగో, ఆస్పత్రి వచ్చేసింది. అయిదు నిమిషాల్లో చేరుకుంటాం. అక్కడ పెద్ద డాక్టర్ నాకు తెలుసులే. మందులిస్తాడు. చూస్తుండు, జబ్బంతా క్షణంలో మాయమవుతుంది. డాక్టర్ కాస్త కోపిష్టిలే. మొదట అరుస్తాడు. ఇంత ఆలస్యమెందుకు చేశావూ? చివరి క్షణాన తీసుకొస్తే రక్షించటానికి నేనేం దేవుణ్ణా. నీ పెళ్లాన్ని యింకెక్కడికన్నా తీసుకుపో. నేను చూడను వెళ్లు" అంటాడు. అలా కళ్లు మూసుక్కూచున్నావేమిటే దరిద్రురాలా, వింటున్నావా లేదా....

కొరడా దెబ్బలకు గుర్రం పరిగెత్తు తుందనుకొంటాడు వడ్రంగి.

"నేనంటానూ... పొద్దున్నే బయల్దేరాను బాబూ. దేవుడి మీదొట్టు. ఈ మంచు తుఫాను యిలా వుంటే త్వరగా ఎలా రాగలనూ? ఈ ఎదురుగాలికి రేసు గుర్రాలు కూడా కదలలేవు. ఇంక ఈ పీనుగ కదుల్తుందా? ఏదో రాగలిగాను. అదే గొప్ప. డాక్టరుకు కోపం వస్తుంది. నీ సంగత్తెలుసులే. దార్లో ఎన్నిసార్లు సారా కొట్ల దగ్గిర ఆగాడో తెలియదా ఏమిటి? అంటాడు. నేనంటానూ 'అదేమిటి డాక్టర్ బాబూ. నా పెళ్లాం చావు బ్రతుకుల్లో వుంటే తాగేటంత నీచుణ్ణా నేను. మేం పేదోళ్లమే. కోపమొస్తే నాలుగు తన్నండి.' అని. 'తాగుబోతు వెధవా, అన్నీ అబద్ధాలే' అంటాడు డాక్టర్. "నీ కాళ్లు పట్టుకుంటాను. నా ముసల్దానికి నయం చెయ్యి. నీ రుణముంచుకోను. మంచి సిగార్ కేసేస్ చేసి యిస్తాను. అది మీరు మాస్కోలో కొనాలంటే, నాలుగు రూబుళ్లవుతుంది. అంతమంచి సిగార్ కేస్" అంటాన్నేను. డాక్టర్ నవ్వుతూ "సర్లే. మంచివాడివే కాని తాగుబోతువి" అంటాడు. అబ్బా. బండి రోడ్డు దిగిపోతున్నదేమిటే. ఛ. ఈ తుఫానెప్పుడు తగ్గాలీ గుర్రం ఎప్పుడు ముందు పోవాలీ...."

క్షణం విరామం లేకుండా వడ్రంగి వాగుతూనే వుంటాడు. ఎంత వాగినా లోపలి భయం మాత్రం తగ్గదు. ఇన్నాళ్లూ నిర్విచారంగా, తాగుడు మత్తులో గడిపాడు. తాగుడులో బాధాలేదు. ఆనందమూ లేదు. అన్నీ మరచిన స్థితి అది. పెళ్లాన్ని తీసుకుపోతున్న ఈ క్షణాన తెలిసింది భయమంటే ఏమిటో...

మొన్న మొదలైందీ గొడవ. ఎప్పట్లాగే, తాగి తూలుతూ యింటి కొచ్చాడు. ఎప్పటిలాగే బూతులు కూస్తూ, పెళ్లాన్ని చావబాదాడు. అన్నాళ్లూ చక్కగా తన్నులు తిన్న పెళ్లాం 'ఈనాటితో సరి' అన్నట్టుగా చూసింది. ఆమెకు జీవితంలో పుష్కలంగా దొరికినవి మొగుడి చేతి దెబ్బలు. తిండికాదు. ఎంత తన్నినా

కదలకుండా పడుందే తప్ప చేతులడ్డం కూడా పెట్టలేదు. ఆ కళ్లలో దైన్యం లేదు. పట్టించుకోనితనం వున్నది. అలాంటి మనిషి మరి కొన్నాళ్లయినా బతకాలని వడ్రంగి ఆస్పత్రికి బయల్దేరాడు.

"ఒసేవ్, డాక్టర్ అడిగితే, నేను నిన్ను కొట్టానని చెప్పొద్దేం. ఇక మీద కొట్టనులే. ఒట్టు. నువ్వే చెప్పు. కోపంతో ఎప్పుడైనా కొట్టానా? ఏదో తాగి సరదాగా కొట్టానే తప్ప.

ఇక మీద సరదాకు కూడా కొట్టనులే, ఆస్పత్రికి పోతున్నాం గదా, త్వరలో నయమైపోతుంది... బండీ ఎటుపోతున్నది... దారి తప్పలేదు గద... మాట్లాడవేమే దరిద్రురాలా. డొక్కలో నొప్పిగా వుందా...."

పెళ్లాం మొహంమీది మంచు కరగటం లేదు. కనుగుడ్లు కదలటం లేదు.

"మాట్లాడవే. నామాట వినకపోతే నిన్ను డాక్టరు దగ్గిరకు తీసుకెళ్లను మరి..."

పగ్గాలు వదిలేసి ఆలోచనలో పడతాడు. ఆ మొహం కేసి చూడాలంటే భయమేస్తుంది. అదింతవరకూ తనను ధిక్కరించలేదే. మాట్లాడకుంటే మాట్లాడేది. వద్దంటే నోర్మూసుకునేది. శరీరమంతా మంచులాగే వుంది. ప్రాణమెప్పుడో పోయింది.

"హరి దేవుడా. ఇప్పుడేం చెయ్యను?" అంటూ ఏడ్చాడు వడ్రంగి.

విచారాన్ని మించిన ఆలోచనల్లో పడ్డాడు. ఈ లోకంలో అన్నీ ఎలా అనుకోకుండా జరిగిపోతాయి. తాగుడు మానేద్దామనుకున్నాడు. దాన్ని చావకొట్టొద్దనుకున్నాడు. సరిగ్గా అదే సమయాన అది చచ్చూరుకుంది. నలభై ఏళ్లు సంసారం చేసాడు. నలభై ఏళ్లను సారాసీసాలో బంధించాడు. పొరబాటు తెలుసుకొని బాగుపడాలనుకున్నప్పుడే యిలా జరగాలా?

"ఇంట్లో తిండి లేకపోతే, ఆ ఇంట్లో ఈ ఇంట్లో అడిగి తెచ్చి మరీ పెట్టేది. మరో పదేళ్లన్నా బతకాల్సింది. తొందరపడింది మూర్ఖురాలు. అవునూ, తన్నెక్కడ సమాధి చెయ్యాలింతకూ?"

ఎంత కొట్టినా గుర్రం కదలదు. చక్రాలు మంచులో కూరుకుపోయాయి. మొహం మీద మంచుపేరుకు పోయి కళ్లు కనిపించవు.


"నేను మళ్లీ కొత్త జీవితం ప్రారంభించ గలిగితే..."

నలభై ఏళ్ల క్రింద అందంగా, ఆరోగ్యంగా, నవ్వుతూ తుళ్లుతూ వుండేది. తన పనితనం చూసి పిల్లనిచ్చారు. సుఖంగా, సంతోషంగా గడపాల్సిన సంసారం. కాని పెళ్లి తర్వాత తాగుడు అలవాటైంది. అంతే. అది లేని రోజు లేదు. తప్పతాగి యింటికి రావటం. అబద్ధాలు, తిట్లు, కొట్లాటలు. అది నలభై ఏళ్ల దిన చర్య.

తెల్లటి మబ్బులు బూడిద రంగుకు మారాయి.

"ఎక్కడి కెళుతున్నాన్నేను? దాన్ని సమాధి చెయ్యాలి. గుర్రం నెమ్మదిగా కదులుతుంది...."

బండి పక్కలకు ఏదో కొట్టుకుంటున్నది. అది మృతురాలి తల.



"మళ్లీ కొత్త జీవితం ప్రారంభిస్తాను. కొత్త పనిముట్లు కొనుక్కుంటాను. సంపాదించిందంతా దానికిస్తాను. సంతోషిస్తుంది..."

ఎందుకూ బండి తోలటం. కళ్లెం వదిలేస్తాను. గుర్రానికి దారి తెలుసు. ఎలాగోలా యింటికిపోతుంది. "సమాధి చేసే పని రేపు కదా... కాస్త పడుకుంటాను."

కళ్లు మూతలు పడతాయి. మరి కాసేపటికి గుర్రం కూడా ఆగుతుంది.... ముందర ఇల్లో, గడ్డివామో కనిపిస్తుంది. చూడాలంటే బద్ధకం. నీరసం. ఏదైతే మాత్రం చేసేదేముంది. నిద్రముంచుకొస్తుంది.

కళ్లు తెరిచేసరికి పెద్దలైట్లు. విశాలమైన హాలు. చుట్టూ జనం.

"సమాధి చెయ్యాలి కదూ. అందుకే యింత జనం."

ఎదురుగా డాక్టర్. లేచి ఆయన కాళ్లమీద పడబోతాడు. 'డాక్టర్ గారూ' లేవలేడు.

"డాక్టరు గారూ నా కాళ్లూ, చేతులూ ఏవి?"

"రాత్రంతా బండిలో వున్నావు గదా! చలికి, మంచుకో చచ్చుబడిపోయాయి. ఫరవాలేదులే. ఏడవకు. ఇంకా బతికున్నందుకు సంతోషించు. అరవై ఏళ్లు సుఖంగా గడిపావు. చాలదూ! ముసలితనంలో యిలాంటివి తప్పవులే...."

"డాక్టర్ గారూ, మరొక్క అయిదారేళ్లు నేను ఆరోగ్యంగా వుండగలగాలి."

"ఎందుకు?"

"గుర్రం ఎవరిదో అప్పు తెచ్చుకున్నాను దాన్ని వాపసు చేయాలి. నా భార్యను సమాధి చెయ్యాలి. ఈ లోకంలో అన్నీ యింత త్వర త్వరగా జరిగిపోతే ఎలాగ? ఇంకా మీకు సిగారు కేసు చేసివ్వాలి..."

కాళ్లూ, చేతులూ లేని వడ్రంగిని చూసి డాక్టర్ పెదవి విరిచి వెళ్లిపోతాడు. ■

## కాజోల్‌కు ఆడపిల్ల

ఈ ఏప్రిల్ నెల 20వ తారీఖున బాలీవుడ్ నటి కాజోల్‌కు ఆడపిల్ల పుట్టింది. ఈ సంగతి తెలియగానే అజయ్ దేవగణ్ చాలా సంతోషించాడు. "ఆదివారం నాడు షూటింగుల కెళ్లను. అదృష్టవశాత్తూ పాపాయి పుట్టిన రోజు ఆదివారం కనుక హాయిగా ఆ రోజంతా ఆమెతోనే గడిపాను. ఆడపిల్లా, మగపిల్లాడా అనేది కాదు సమస్య. తల్లీ, సంతానం ఇద్దరూ కుశలంగా వుండాలనేదే నా కోరిక" అన్నాడు. పోయినేడాది కాజోల్‌కు గర్భస్రావం జరిగింది. అదీ అజయ్ భయానికి కారణం.